


# రాని బాకీలు

ప్రతాప రవిశంకర్

ముత్తురామన్ ఫైళ్ళలో మునిగిపోయేడు.

అప్పటికి అతను ఆఫీసుకివచ్చి రెండు గంటలు కావస్తోంది. తోటిఉద్యోగులు కూడా వివరిఫైళ్ళతోవాళ్ళు కుస్తీ పడుతున్నారు.

'మీకోసం ఎవరోవచ్చారు. అరుణాచలంట' ముత్తురామన్ దగ్గరగా వచ్చి చెప్పాడు ప్యూను జకరయ్య.

ఫైల్లోనించి చటుక్కున తలపైకెత్తి "అరుణాచలమా?" కొంచెం భయంగా అన్నాడు ముత్తురామన్.

అతని మాట విని మిగిలిన గుమాస్తాలందరూ తలలుపైకెత్తి అతనికేసి చూశారు.

ఫైళ్ళనిమూసి ప్యూనుతో బయటకు నడిచాడు ముత్తురామన్.

ఐదునిముషాలపాటు నిశ్శబ్దం... అతను లోపలకురాలేదు.

కాని బయటనించి ఎవరివో మాటలు పెద్దగా వినిపించాయి. చెవులురిక్కించారు గుమాస్తాలు.

"సాటివాడివని ఓపిక పట్టాను. ఇంకెన్నాళ్ళని ఆగమంటావ్? బుద్ధి లేదూ? నాకు మాత్రం డబ్బుతో అవసరముండదను కున్నావా? నేనేం అధికారినా? ఈరోజు నాడబ్బు ఇవ్వకపోతే ఏంచేస్తానో చూస్తాను."

గుమాస్తాలు ఒకరిముఖాలొకరు చూసుకున్నారు. ఆతరువాత సైగలు చేసికొని బయటకు నడిచారు.

ఆఫీసు భవనానికి పదిగజాలదూరంలో వున్న వేపచెట్టు క్రింద నిలబడివున్నారు. ఇద్దరూ

ముత్తురామన్— మరో మనిషి అరుణాచలం ఐవుండవచ్చుననుకున్నారు. జకరయ్య అక్కడ లేడు.

"ప్లీజ్.. నాపరువు తీయకు. మరోపది రోజులు ఓపికపట్టు చలం" అతను మెల్లగానే అన్న ముత్తురామన్ మాటలు వీళ్ళకు వినిపించాయి.

"నేను నీ పరువు తీస్తున్నానా. అసలు నీకు పరువంటూవుందా? పరువున్నవాడివైతే ఇన్నాళ్ళు నీచుట్టూ తిప్పుకునేవాడివికాదు" అన్నాడు అరుణాచలం.

"మర్యాదగా మాట్లాడు" కోపంగా అన్నాడు ముత్తురామన్.

"ఏంచేస్తావ్?" ముత్తురామన్ మీదికి వచ్చేడు అరుణాచలం. వెంటనే ముత్తురామన్ అతనిషర్టు కాలరుపుచ్చుకున్నాడు.

ఆశ్చర్యపోయేరు గుమాస్తాలు. ముత్తురామన్ అంత ధైర్యంచేస్తాడనుకోలేదు. పరిస్థితి చెయ్యిదాటిపోతోందని చెట్టుదగ్గరకు చేరి ఇద్దరినీవిడదీశారు.

"మీరు చెప్పండిసార్. సాటివాడని, కష్టాల్లో వచ్చిఅడిగాడని ఐదువందలు నోటు కూడా లేకుండా ఇచ్చాను అప్పుగా. ఇప్పటికి ఎనిమిది నెలలయింది. ఇంతవరకు పైసా కూడా చెల్లెయ్యలేదు. వడ్డీకూడా అక్కర్లేదే. నాలుగునెల్లనించీ తిప్పుకుంటున్నాడు. అదేమంటే కాలరు పుచ్చుకున్నాడు. ఇదిన్యాయమేనా?" నిలదీసి అడిగాడు అరుణాచలం విడదీసిన గుమాస్తాలను.

ఎవ్వరూ పెదవి కదపలేదు.

ఆ ఆఫీసుస్టాఫ్‌లో ముత్తురామన్ ఒక్కడే ఆంధ్రుడు కాదు. అతనికి భార్యతప్ప తన వాళ్ళంటూ ఎవ్వరూ లేరు. ఇద్దరుపిల్లలు పుట్టిపోయేరు. అతనికి నాలుగువందలుజీతం. నెలకి న్యాయంగా వందో, మరోయాభయ్యో మిగులుతాయి. అపోహలోనే తోటిఉద్యోగుల్లో కొంతమంది ఆర్నెల్లక్రితం తమ అవసరాలకు అతనివద్ద అప్పుచేశారు. ఐదువందల వరకూ లేదనకుండా అప్పులిచ్చేడు. కాని ఒక్కరూ అతనిబాకీ తీర్చలేదు ఇవాళ- రేపుఅంటూ దాటేస్తున్నారు. గట్టిగాఅడగటానికి భయం. ముత్తురామన్ మొదట్నించీ మెతకవాడు.

"చెప్పండి సార్... అప్పటికీ నేను వడ్డీ వద్దు. అసలివ్వమన్నాను. అందుక్కూడా ఒప్పుకోడంలేదు. సాటివాడని అభిమానం చూపడం బుద్ధితక్కువైంది." అన్నాడు అరుణాచలం.

నిముషం తర్వాత "ముత్తురామన్ అప్పుచేశాడంటే నమ్మలేకుండా వున్నాను. అతనికి అప్పుచేయాల్సిన అవసరం లేదు" అన్నాడు ఓ నడివయసు గుమాస్తా.

"లేకపోతే ఎవడుచేస్తాడు? ఆ రాత్రి పరిగెత్తుకుంటూ వచ్చాడు. తన భార్య చావు బతుకుల్లో వుందని, ఆపరేషన్ చెయ్యకపోతే దక్కదని చాలా ఇబ్బందిపడుతూ చెప్పాడు. అటువంటి స్థితిలో కాదని ఎలా అనగలను ఇచ్చాను"

'ఏమైనా పదిరోజుల్లోగా నేను ఇవ్వలేను' అన్నాడు మొండిగా ముత్తురామన్.

"ఎట్లా ఇవ్వవో నేనుచూస్తాను. ఈరోజు మొదటితారీఖు. జీతం తీసుకు బయటకు రాగానే తన్ని లాక్కుపోతాను. సాయంత్రం వరకూ ఇక్కడే కూర్చుంటాను" అన్నాడు అరుణాచలం.

అతను ఆమాట అనగానే భయంగా— దీనంగా గుమాస్తాలకేసి చూశాడు ముత్తురామన్.

గుమాస్తాలు అరుణాచలంకేసి చూశారు. నిజంగానే తన్నిలాక్కుపోయేట్టు కనిపించాడు, పరిస్థితి గ్రహించి వారిద్దరికి కొంచెందూరం వెళ్ళి గుసగుసలాడుకున్నారు.

ఐదునిముషాల తర్వాత తిరిగివచ్చి "మీరితన్ని వదిలేయండి. సాయంత్రం ఐదు గంటలకురండి. మీబాకీ తీర్చేట్టు మేము చూస్తాము." అన్నాడు వాళ్ళలో కొంచెం లావుగావున్న గుమాస్తా.. మిగిలినవారందరూ అవునన్నట్టు తలఊపారు.

## రా ని బా కీ లు

"మీ మాట మీద నమ్మకంతో వదులుతున్నాను. సాయంత్రంబాకీ తీర్చకపోతే ముత్తురామన్‌ని మీరు మళ్ళీ చూడలేరు." అని భయపెట్టి విసురుగా వెళ్ళిపోయేడు అరుణాచలం.

ముత్తురామన్‌ని తీసికొని అందరూ లోపలకు నడిచారు. ఎవరిపనుల్లో వాళ్ళు ఇరుక్కుపోయేరు.




లంచ్ టైంలో ముత్తురామన్ ఎవ్వరితోనూ మాట్లాడలేదు.

సాయంత్రమయింది. అందరూ జీతాలందుకున్నారు. ఎవరికివారే ముత్తురామన్‌దగ్గరికి వచ్చి వారిబాకీని వడ్డీతో సహా చెల్లించేరు. బాకీలన్నీవసూలయ్యేయి.

గడియారం ఐదు గంటలు కొట్టింది.

బయటకువచ్చాడు ముత్తురామన్, వేప చెట్టు కింద నక్షత్రకుడిలా నించునివున్నాడు అరుణాచలం. తోటిగుమాస్తాలందరూ చూస్తుండగా ఆరువందలు అతనికియిచ్చాడు తర్వాత గుమాస్తాలకు థ్యాంక్సుచెప్పుకొని రిక్షా ఎక్కి వెళిపోయేడు. అప్పటికే అరుణాచలం మాయమయ్యేడు.

ప్రతి మొదటి తారీఖు హోటల్ ఉదయ జనతా అందరూ కలిసి టిఫిన్ తినడం గుమాస్తాల అలవాటు.

కబుర్లుచెప్పుకుంటూ అయిదూనిమిషాలకి హోటల్‌దగ్గరకు వచ్చిన గుమాస్తాలకు ఒకరి భుజాలమీద మరొకరు చేతులు వేసికొని నవ్వుకుంటూ హోటల్లోనించి బయటకు వస్తున్న ముత్తురామన్ అరుణాచలం కనిపించేరు.

అంతా ఆశ్చర్యపోయేరు.

ముత్తురామన్- అరుణాచలం ప్రాణ స్నేహితులని అరుణాచలం ఆ క్రితంరోజే విశాఖ పట్నంనించి వచ్చాడనీ, రానిబాకీలను వసూలు చేసుకోవడంకోసం ముత్తురామనే మిత్రుడి చేత నాటకం ఆడించాడనీ వాళ్ళు వూహించలేకపోయేరు.

